క్లుప్తంగా

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణీలకు ఆహారం అందిస్తున్న తహసీల్దార్

ప్రత్తిపాడు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కు వైద్య పరీక్షల(స్కానింగ్)కు వచ్చిన గర్భిణులకు లయన్స్‌క్లబ్ సభ్యులు మంగళవారం పౌష్టికాహారాన్ని అందజేశారు. ఊటా బుల్లెమ్మాయి, చిన్న సత్తిరాజు జ్ఞాపకార్థం స్థానిక తహసీల్దార్ పిండి వీర వెంకట గోపాలకృష్ణ పౌష్టికాహారాన్ని సమకూర్చారు. వీటిని తహసీల్దార్ గోపాలకృష్ణ చేతుల మీదుగా 63 మంది గర్భిణులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఇంజనీర్ మోహన్, సభ్యులు గుడాల వెంకట రత్నం, రెడ్డి నాయుడు, సీహెచ్‌సీ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ కె.కన్యాకుమారి, సీహెచ్‌సీ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



శివాలయం వీధిలో తొలగించిన పూడిక

ఏలేశ్వరం: పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరచడానికి మున్సిపల్ అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. ఈ నెల 21న సాక్షి దినపత్రికలో అధ్వానం పారిశుధ్యం శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా స్థానిక శివాలయం వీధిలో మురుగు రహదారిపై ప్రవహించకుండా కల్వర్టుపై శ్లాబ్ రాళ్లు తొలగించి పూడికను తీశారు. దీంతో మురుగు సమస్య తీరింది. దిబ్బలపాలెంలో ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్తను తొలగించారు. అధికారుల తీరుపై స్థానిక హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్న సమారాధన

జగ్గంపేట: స్థానిక టవర్ కాలనీ సమీపంలో పొలాలకు వెళ్లే మార్గంలో ఉన్న ధనసత్తమ్మతల్లి ఆలయం వద్ద మంగళవారం అన్న సమారాధన నిర్వహించారు. అమ్మవారికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భక్తుల ఆర్థిక సహాయంతో ప్రతి మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు వైబోగుల కొండబాబు తెలిపారు. స్థానికులు సిమ్మ దుర్గాప్రసాద్, కాకినాడ శ్రీను, గుళ్ల ప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల సందర్శన

ఏలేశ్వరం: నియోజవర్గంలోని ప్రాజెక్టులను మంగళవారం టీడీపీ నేతలు సందర్శించారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో ఏలేరు ప్రాజెక్టు, సుబ్బారెడ్డిసాగర్, చంద్రబాబు సాగర్‌లను పరిశీలించారు. ప్రాజెక్టుల అభివృద్ధిపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. పార్టీనాయకులు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఈఈపై కేసు నమోదు చేయాలి

కిర్లంపూడి: కులం పేరుతో దూషించిన పెద్దాపురం ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావుపై అట్రాసిటి కేసు నమోదు చేయాలంటూ రాజుపాలెం నుంచి సామర్లకోట వెళ్లే ప్రధాన రహదారిపై దళిత సంఘాలు మంగళవారం ధర్నా నిర్వహించారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. సుమారు గంట సేపు వాహనాలు నిలిచిపోయాయి. దీనిపై ఆందోళనకారులు మాట్లాడుతూ ఈఈ వెంకటేశ్వరరావు రోడ్డు వివాదంలో మమ్ములను కులం పేరుతో దూషించడమే కాకుండా మాపై కేసు పెట్టారన్నారు. అప్పట్లో ఈఈపై తామ ఫిర్యాదు చేసినా పోలీసులు స్వీకరించలేదన్నారు. అతనిపై పోలీసులు కేసు నమోదు చేసే వరకు ధర్నా విరమించేది లేదని తెలిపారు. సమాచారం అందుకున్న సీఐ లక్ష్మణరావు, స్థానిక ఎస్సై పి.ఉమామహేశ్వరరావు రాజుపాలెం చేరుకుని నిరసనకారులతో మాట్లాడి ధర్నా విరవింపజేశారు. దీనిపై ఎస్సైని వివరణ అడగగా గతంలో రాజుపాలెం గ్రామానికి చెందిన కొల్లు నాని, పలువురిని ఈఈ కులం పేరుతో దూషించారంటూ ఇచ్చిన ఫిర్యాదుతో ఈఈ నాగేశ్వరావుపై కేసు నమోదు చేశామన్నారు.

ఎంపీటీసీల సమస్యలు తీర్చాలి

కిర్లంపూడి: ఎంపీటీసీల సమస్యలు తీర్చాలంటూ స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీపీ తోట రవికి అందజేశారు. గ్రామాల అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయించడం, నెలకు రూ.20 వేలు కనీస వేతనం, గ్రామాల్లో చేపట్టే ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రోటోకాల్ కల్పించడం, ప్రతి సచివాలయంలోను ఎంపీటీసీలకు ప్రత్యేక చైర్‌ను ఏర్పాటు చేయడం వంటి పలు డిమాండ్లతో వినతి పత్రం అందజేశారు.

ఎన్‌ఎంఎంఎస్‌లో చదలాడ విద్యార్థి ప్రతిభ

పెద్దాపురం: జాతీయ స్థాయి ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో చదలాడ హైస్కూల్‌కు చెందిన అభ్యసన స్టడీ సర్కిల్ విద్యార్థి వేమన రామ నాగేశ్వరరావు ఉత్తమ ప్రతిభ కనపర్చాడు. 9వ తరగతి ప్రవేశానికి నిర్వహించే ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అతడిని స్టడీ సర్కిల్ నిర్వాహకులు కమ్మిల బుజ్జిబాబును గ్రామస్థులు అభినందించారు.

అతివలే అధికం

- ఓటర్ల తుది జాబితా విడుదల
- ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఓటర్లు 2,13,639
- నియోజకవర్గ ఎన్నికల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: నియోజకవర్గంలో పురుషుల ఓటర్ల కంటే 2,795 మంది మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారని జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్, నియోజకవర్గ ఎన్నికల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఎన్నికల సిబ్బంది, వివిధ రాజకీయ నాయకులతో తుది ఓటరు జాబితా ప్రకటనపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని 227 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 1,05412 మంది పురుషులు, 1,08,207 మంది స్త్రీలు, ఇతరులు 20 మంది వెరసి 2,13,639 మంది ఓటర్లున్నారు. 2023 అక్టోబర్ 27 నాటి ముసాయిదా ఓటర్ల జాబితాలో 2,09,543 మంది ఉండగా తుది జాబితా నాటికి 4,147 మంది ఓటర్లు పెరిగారు. నియోజకవర్గంలో మరణాలు, వలసలు, ఎక్కువ బూత్‌ల్లో పేర్ల నమోదు తదితర 3,181 మంది ఓటర్లను తొలగించగా 7,277 మంది ఓటర్లను జాబితాలో చేర్చారు. ఓటరు జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నుంచి 13,648 అర్జీలు అందాయని, వాటిపై విచారణ చేపట్టి, వాటిలో 3,085 మంది మృతి చెందినట్టు, 217 డబుల్ ఎంట్రీలుగా గుర్తించి తొలగించామన్నారు. 6,155 అర్జీలు వాస్తవమైనవిగా గుర్తించి, 3,494 అర్జీలను తోసిపుచ్చామన్నారు. 18–19 వయస్సు ఉన్న యువత ముసాయిదాలో 1,635 మంది ఉండగా తుది జాబితాలో ఈ సంఖ్య 3,522కి పెరిగిందన్నారు. నియోజకవర్గంలో 2,277 మంది దివ్యాంగ ఓటర్లు, 72 మంది సర్వీసు ఓటర్లు, 1,384 మంది సెక్స్ వర్కర్లు, 20 మంది ట్రాన్స్‌జెండర్లు (ఇతరులు) ఉన్నారు. ముసాయిదా ప్రచురణ సమయంలో ఒకే డోర్ నంబర్‌లో పది కంటే ఎక్కువ మంది ఉన్న ఇళ్లు 164 ఉండగా వాటిని సరిదిద్దామన్నారు. జంక్ క్యారెక్టర్లు గల ఇళ్లు 44 ఉండగా సాంకేతిక కారణాల రీత్యా మూడింటిని పెండింగ్‌లో ఉంచామని చెప్పారు. 590 ఫొటో సారూప్య ఎంట్రీలు(పీఎస్ఈ), 145 డెమోగ్రాఫికల్ సారూప్య ఎంట్రీలు (డీఎస్ఈ) తొలగించామని రాజకీయ నాయకులు అడిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. ప్రత్తిపాడు మండలంలోని గిరిజనాపురం గిరిజన తండాలోని 11 కుటుంబాలకు చెందిన 19 మందిని ఓటర్లుగా నమోదు చేశామన్నారు. కాగా పోలింగ్ కేంద్రాల న్నిటికీ ర్యాంప్, వెలుతురు, తాగు నీరు వంటి వసతులు ఏర్పాటు చేసినట్టు జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్, నియోజకవర్గ ఎన్నికల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం తహసీల్దార్లు పీవీవీ గోపాలకృష్ణ, జి చిన్నారావు, కె.నాగ సుబ్రహ్మణ్యం, ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ ఎ.శ్రీనివాసరావు, ప్రత్తిపాడు డిప్యూటీ తహసీల్దార్ (ఎన్నికలు) టి.శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు శింగిలిదేవి సత్తిరాజు, ధరణాలకోట శ్రీను, రొంగల ఈశ్వరరావు, మదినే బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

తుది జాబితాలో ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఓటర్లు

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
ఏలేశ్వరం రూరల్	18,133	18,622	0	36,755
ఏలేశ్వరం నగర పంచాయతీ	11,698	12,787	4	24,489
ప్రత్తిపాడు	32,100	32,605	2	64,707
శంఖవరం	22,340	22,759	12	45,111
రౌతులపూడి	21,141	21,434	2	42,577
మొత్తం	1,05,412	1,08,434	20	2,13,639

రేపు కౌన్సిల్ సమావేశం

తుని: పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం ఉదయం 11.30 గంటలకు చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ ప్రసాదరాజు మంగళవారం తెలిపారు. కౌన్సిలర్లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

సత్యదేవుని దర్శించిన తూర్పు గోదావరి కలెక్టర్



కలెక్టర్ మాధవీలతకు స్వాగతం పలుకుతున్న పండితులు

అన్నవరం: తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవీలత తన కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం ఉదయం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి, పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించిన అనంతరం పండితులు వేదాశీస్సులు, దేవస్థానం ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు స్వామివారి ప్రసాదాలు అందజేశారు. కలెక్టర్ మాధవీలత వెంట పలువురు రెవెన్యూ, పోలీసు అధికారులు ఉన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట

- గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష
- ప్రజలకు వైద్య పరీక్షలు, మందుల అందజేత

కోటనందూరు: ప్రజారోగ్య పరిరక్షణకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. మంగళవారం ఇండుగపల్లిలో ఏర్పాటు చేసిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ కుంచే సత్యవతి, సుర్ల రాంబాబులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ శ్రీనివాసు మాట్లాడుతూ పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించే లక్ష్యంగా నిష్ణాతులైన వైద్యుల ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. అనారోగ్యానికి గురైన పేదలను వారి ఆరోగ్యం నయమయ్యే వరకూ వైద్యులు పర్యవేక్షిస్తున్నారన్నారు. అనంతరం రోగులకు ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, ఏఎంబీ జిల్లా చైర్మన్ లంక ప్రసాద్, మండల అధ్యక్షుడు సుర్ల రాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు చింతకాయల చినబాబు,కుంచే అచ్చిరాజు, గిడుతూరి రాంబాబు, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శిలు కుశిరెడ్డి అప్పలరాజు, రామచంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇండుగపల్లిలో మహిళకు కిట్లను అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు

ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక లయన్స్‌క్లబ్ కమ్యూనిటీ హాలు ఆవరణలో మంగళవారం రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరం ప్రారంభ సభలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతీ ఒక్కరికీ వైద్యం అందించగలుగుతున్నామన్నారు. ఈ శిబిరంలో 276 మంది వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్లు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాఘవపట్నంలో..

రౌతులపూడి: రాఘవపట్నంలో జగనన్న ఆరోగ్య సురక్షను నిర్వహించారు. వైద్యాధికారి ఎం.విశ్వనాథ్ గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 210 మందికి మూడు విభాగాలలో వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. పలు ఆరోగ్య సూచనలు చేశారు. ఆర్థోపెడిక్ వైద్యులు పి.వెంకటభార్గవ్, గైనికాలిజిస్టు మౌనితత్వమిని, ఆప్తలిజిస్టు కె.హరిబాబు, వైద్య సిబ్బంది, సచివాలయ కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయాల్లో ధాన్యపు కుచ్చులు

తుని రూరల్: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ, రానున్న వేసవిలో పిచ్చుకల ఆహార కొరత నివారించేందుకు రామాలయాల్లో వరి కుచ్చులు ఏర్పాటు చేస్తున్నట్టు హరిత వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు దాలినాయుడు మాస్టర్ (పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు) మంగళవారం తెలిపారు. మొదటి రోజు తుని పట్టణంలో అన్ని రామాలయాల్లో వరి కుచ్చులను వేలాడదీసినట్టు ఆయన తెలిపారు. తుని మండలంలో ముగిసిన తర్వాత కోటనందూరు, తొండంగి, రౌతులపూడి, శంఖవరం మండలాల్లోని గ్రామాల్లో కుచ్చులు కడతామన్నారు. మెట్ట ప్రాంతంలో ఖరీఫ్ తర్వాత రబీ పంటలు కొంత మేరకే వేస్తారని, ఆ సమయంలో పక్షులకు ప్రధానంగా పిచ్చుకలకు ఆహారం కొరత ఏర్పడుతుందన్నారు. ఈ కుచ్చులు కట్టడం వల్ల కొంతమేరకు పిచ్చుకలకు ఆహారం అందుతుందన్నారు. వేసవిలో నీటి కొరత తీర్చేందుకు ప్రతి ఇంటి బయట పక్షులకు అనువుగా తాగునీరు ఏర్పాటు చేయాలని తాము పర్యటించే గ్రామీణులను చైతన్యపర్చుతున్నామన్నారు. ఖరీఫ్‌లో సేకరించిన ధాన్యపు కంకులతో కుచ్చులు తయారు చేశామన్నారు. ఐదు మండలాల్లో 120 నుంచి 150 వరకు ఆలయాల్లో కుంచెలు కట్టే ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన వివరించారు.



కుమ్మరిలోవ రామాలయంలో వరి కుచ్చులు కడుతున్న దాలినాయుడు మాస్టర్

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ఏలేశ్వరం: విద్యార్థులు సాంకేతిక విద్య నేర్చుకోవాలని వైఎస్సార్ సీపీ నేత, ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి శివప్రసాద్ అన్నారు. తూర్పులక్ష్మీపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సాంకేతిక విద్య అవసరమని సీఎం జగన్ ట్యాబ్‌లను విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సాంకేతిక విద్య నేర్పించడం సీఎం జగన్ పనితీరు నిదర్శమన్నారు. సీఎం జగన్ పాలనలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టిందన్నారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్‌పర్సన్ మేరికృష్ణ, హెచ్ఎం సింహాచలం, సచివాలయ కన్వీనర్ డి.కృష్ణ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

గోకవరం: విద్యాభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. గోకవరంలో స్థానిక సంజీవయ్యనగర్‌లోని ఎంపీయూపీ పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు మంగళవారం ట్యాబ్‌ల పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు సద్వినియోగం చేసుకొని విద్యలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. స్థానిక నాయకులు తోలేటి రాంప్రసాద్, బొడ్డపాటి వీరచంద్రం, బిజ్జి రాజు, మచ్చా మోహన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేస్తు ప్రసాద్

30 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

తొండంగి: పాతపెరుమాళ్లపురంలో సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్సై బి.వినయ్‌ప్రతాప్ మంగళవారం తెలిపారు. పాతపెరుమాళ్లపురం గ్రామంలో దుర్గామాత ఆలయం సమీపంలో వై.సుబ్బారావు సంచిలో 30 లీటర్ల సారా తరలిస్తుండగా పోలీసు సిబ్బంది పట్టుకుని, అతని నుంచి సారా స్వాధీనం చేసుకున్నారు. అతనిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు

- మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు
- గజ్జనపూడిలో ఆత్మీయ సమావేశం

ప్రత్తిపాడు రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని స్థానిక మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని గజ్జనపూడిలో మంగళవారం సాయంత్రం స్థానిక ఎంపీటీసీ మొల్లి వీరబాబు ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి ప్రజల్లో రోజు రోజుకు ఆదరణ పెరుగుతుందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్ సీపీకి ఓటు వేసి గెలిపించేందకులు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వరుపులకు స్థానిక ప్రజలు, పార్టీ శ్రేణులు పూల మాలలు వేసి ఘన స్వాగతం పలికి హారతులిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, గ్రామ సర్పంచ్ గొనగాల అప్పలరాజు, పార్టీ యూత్ లీడర్ రామిశెట్టి రామిశెట్టి బులిరామకృష్ణ, సొసైటీ ఛైర్మన్ కొప్పన గంగారావు, ఎంపీటీసీ ఉమ్మిడి తాతీలు, పార్టీ నాయకులు పినిశెట్టి ప్రకాష్, గొల్లపల్లి దొరబాబు, కొప్పన సుబ్బారావు, బోడపాటి నాగేశ్వరరావు, అల్లు సత్తిబాబు, కొండేపూడి అబ్బాయి, రాపా గుర్రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వరుపుల పర్యటన

శంఖవరం: మండలంలోని గౌరంపేట, శృంగధార, పి.మల్లాపురం, వేళంగి గ్రామాల్లో స్థానిక మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు పర్యటించారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కష్టించి పని చేయాలన్నారు. పార్టీ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజుబాబు, మాజీ సర్పంచ్ పసగడుగుల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్రాజు బాబులు, పాకల రాజు తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌చంద్రబోస్ సేవలు చిరస్మరణీయం



జగ్గంపేటలో నేతాజీకి నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు



ఏలేశ్వరంలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పెరుమాళ్లపురం కళాశాలలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిబ్బంది

శంఖవరం: స్వాతంత్య్ర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రిన్సిపాల్ సీహెచ్ వీరబాబు అన్నారు. కత్తిపూడి సీతారామా కళాశాలలో సుభాష్ చంద్రబోష్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశం కోసం, దేశ రక్షణ కోసం జాతీయ సైన్యాన్ని తయారు చేసిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.అక్కారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేతాజి సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళులు

తొండంగి: పెరుమాళ్లపురం డిగ్రీ కళాశాలలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు, అధ్యాపకులు కలిసి నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘని నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మెహర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేతాజీ జయంతి

ఏలేశ్వరం: నేతాజీ సుభాష్‌చంద్ర బోస్ జయంతిని పట్టణంలో మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేతలు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్, ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు చేశారు. స్థానిక కోనేటిబడి వద్ద నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో నేతాజీ కీలకపాత్ర పోషించారన్నారు. ఆజాద్ హిందూఫౌజ్‌ను ఏర్పాటు చేసి స్వాతంత్ర్య పోరాటంలో తన సైన్యాన్ని వినియోగించారన్నారు. నేటి యువత నేతాజీ ఆశయాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పతివాడ జగదీష్, అరవాల నాగరాజు, దాసరి గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత విగ్రహదాత తూమురౌతు గురయ్య ఆధ్వర్యంలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జగ్గంపేటలో నేతాజీకి ఘన నివాళి

జగ్గంపేట: స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొత్త కొండబాబు, డాక్టర్ బి.వి ప్రసాద్ నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. న్యాయవాది దారా శ్రీనివాస్, బొండా రాంపండు,ఆర్యవైశ్య ప్రముఖులు, స్థానికులు పాల్గొన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

- అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు

కిర్లంపూడి: మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సాధారణ సమావేశం రసాభాసగా మారింది. స్థానిక ప్రజా పరిషత్ క్యార్యాలయంలో ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ తోట రవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ రవి శాఖల వారీగా అధకారులతో సమీక్షించి, సమస్యలను నివృత్తి చేశారు. ఎంపీటీసీలు అధికారుల విధినిర్వాహణలో లోపాలపై నిలదీశారు. అగ్రికల్చర్, హౌసింగ్, విద్యుత్, ఎంజీఎన్ఆర్ఈజీఏ, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న పలు సమస్యలపై ఎంపీడీఓ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ తోట ఆదేశాలతో సమావేశానికి హాజరు కాని డిపార్ట్‌మెంట్‌లకు నోటీసుల జారీ చేసినట్టు ఎంపీడీఓ రాజేశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, తోట గాంధీ, అల్లు శివ రామకృష్ణ, బందారు ప్రసాద్, సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, అంబటి బుజ్జమ్మ పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

ఉద్యానవన పంటలపై అవగాహన

గోకవరం: ఉద్యానవన పంటలపై డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ విద్యార్థులు మంగళవారం రైతు సదస్సు నిర్వహించారు. మండలంలోని వీరలంకపల్లి శివారున రామకృష్ణా గార్డెన్స్‌లో కృషి విజ్ఞాన కేంద్రం, పందిరి మామిడి ధ్యాన పరిశోధన స్థానం సంయుక్తంగా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న వివిధ విశ్వవిద్యాలయాల డాక్టర్ బి.ప్రసన్నకుమార్, డాక్టర్ ఏవీడీ దొరాజీరావు, కోరుకొండ హార్టికల్చర్ అధికారి రిని పాల్గొని రైతులకు మామిడిలో పూత మాడడం, పిందె రాలడం వంటి సమస్యలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ కె.రాజేంద్ర ప్రసాద్, ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామి, రైతులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న విద్యార్థులు

విధుల్లో చేరిన అంగన్‌వాడీలు

రౌతులపూడి: తమ డిమాండ్‌లను నెరవేర్చాలని కోరుతూ గడచిన 42 రోజులుగా అంగన్‌వాడీల టీచర్లు, సహాయకులు చేపట్టిన సమ్మె ప్రభుత్వం చేసిన చర్చలతో ముగిశాయి. దీంతో మంగళవారం మండలంలోని రౌతులపూడి, ఎస్.పైడిపాల సెక్టర్లలో 59 అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న టీచర్లు, సహాయకులు మంగళవారం విధుల్లో చేరారు. ఈ మేరకు శంఖవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయానికి వెళ్లి జాయినింగ్ నివేదకను అందజేశారు.

తొండంగి: మండలంలోని ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ సిబ్బంది మంగళవారం విధులు చేరడంతో కేంద్రాలన్నీ తెరచుకున్నాయి. మండల వ్యాప్తంగా ఒంటిమామిడి, రావికంపాడు, తొండంగి తదితర సెక్టార్ల పరిధిలో 86 కేంద్రాలున్నాయి. ఈ పరిధిలో సిబ్బంది విధుల్లో చేరారు.

రామలింగేశ్వరుడికి పూజలు


పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో వేంచేసియున్న రామలింగేశ్వరునికి మంగళవారం ఆరుద్రా నక్షత్రం సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేయగా భక్తులు దర్శించుకున్నారు.

ఆటో కార్మికుల శాంతి నిరసన



గోకవరంలో నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

గోకవరం: తెలంగాణ మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తారన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆటో కార్మికులు మంగళవారం గోకవరం మండలంలో ఆటో సర్వీసులు నిలిపివేసి శాంతియుతంగా నిరసన తెలిపారు. గోకవరం శివారున శివాలయం నుంచి మొదలుకొని ప్రధాన రహదారి మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం పెట్టి తమ పొట్ట కొట్టవద్దని నినాదాలు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆటో కార్మికులు పాల్గొన్నారు.



ధర్మవరంలో నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

ధర్మవరంలో..

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరంలో సోమవారం తెలంగాణ రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు మద్దతుగా గ్రామానికి చెందిన అన్నపూర్ణ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షకార్యదర్శులు ఏళ్ల శ్రీను, చిట్టూరి ఏసుబాబు మాట్లాడుతూ తెలంగాణాలో ఆర్టీసీ బస్సుల్లో స్త్రీలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్లు పూర్తిగా జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ ప్రభుత్వం తక్షణం స్త్రీలకు ఆర్టీసీ బస్సుల్లో కల్పించిన ఉచిత సౌకర్యాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.